

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ గురుభ్యోనమః

**శ్రీ ప్రణవపీఠాధిపతి, త్రిభాషామహాసహస్రావధాని**

**బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు**



# బుధాష్టమీ వ్రత మాహాత్మ్యం మరియు వ్రతకథ

**సేకరణ:** గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ప్రవచించిన శ్రీ మద్ అగ్నిమహా పురాణం (184 వ అధ్యాయం) నుండి

అష్టమీ తిథి బుధవారం వస్తే దానిని బుధాష్టమీ పర్వదినంగా జరుపుకుంటారు. ఈ వ్రతాన్ని ఆచరించే వారికి గృహ యోగం, రాజ యోగం మరియు దేవతలను, మహాత్ములను నిందించిన పాపం తొలగుతుందని అగ్నిపురాణం చెబుతోంది.

ప్రతి మాసమునందును, అష్టమీ తిథులందు రాత్రి మాత్రమే భోజనము చేసి సంవత్సరాంతమునందు గోదానము చేయవలెను. ఇట్లు చేసిన వాడు ఇంద్రపదమును పొందును. దీనికి స్వర్గతివ్రతమని పేరు. శుక్ల పక్షమందుగాని, కృష్ణపక్షమందుగాని అష్టమీ బుధవారయోగము కలిగినపుడు వ్రతమాచరించి ఒక పూట భోజనము చేయవలెను. అష్టమీ వ్రతము చేయువారికి గృహైశ్వర్యాదులకు లోపముండదు.

## బుధాష్టమీ వ్రత విధానము:

అష్టమీ తిథి బుధవారం వస్తే దానిని బుధాష్టమీ పర్వదినంగా జరుపుకుంటారు. ఈ వ్రతాన్ని ఆచరించే వారికి గృహ యోగం, రాజ యోగం మరియు దేవతలను, మహాత్ములను నిందించిన పాపం తొలగుతుందని శాస్త్రం. ఈ వ్రతమును ఆచరించదలచిన వారు రెండు వ్రేళ్ళు (చూపుడు వేలు, మధ్యవేలు) విడచిన పిడికిలితో ఎనిమిది పిడికిళ్ళ బియ్యముతో అన్నము వండి దీనిని దర్భలు ఉంచిన మామిడాకుల దొన్నెలో నైవేద్యం పెట్టవలెను. ఇలా సమేతుడగు బుధుని పూజించి, బుధాష్టమీ వ్రత కథ విని భోజనము చేయవలెను, పిదప బ్రాహ్మణులకు తండుల (బియ్యం) సహిత మగు కర్కటి (చెంబు) దానము చేసి, యథాశక్తిగా దక్షిణ ఇవ్వవలెను.

## బుధాష్టమీ వ్రతకథ:

పూర్వం ధీరుడను ఒక బ్రాహ్మణుడుండెను. అతని భార్య పేరు రంభ; పుత్రుని పేరు కౌశికుడు, అతనికి విజయ అను పుత్రిక కూడ ఉండెను. అతనికి ధనదము అను ఒక ఎద్దు ఉండెను. కౌశికుడు ఆ ఎద్దును మేపుటకై గోపాలకులతో కలసి అడవికి వెళ్లెను. కౌశికుడు గంగలో స్నానాది కార్యములు చేసికొనుచుండగా ఒక దొంగ ఆ ఎద్దును అపహరించెను. స్నానము చేసి వచ్చిన కౌశికుడు ఎద్దు కనబడక దానిని వెదకుటకై సోదరి యగు విజయతో కలిసి బయలుదేరెను.

ఇతడొక సరోవరమునందు కొందరు స్త్రీలు భక్తితో  వ్రతం చేసుకుంటుండగా చూసాడు. కౌశికుని, విజయని చూసిన ఆ స్త్రీలు ఇలా చెప్పారు. మేము ఇంద్రుని కొలువులో ఉండే  దేవతా స్త్రీలము. మేము కొందరు ఋషులను ఆశ్రమాలు  కట్టుకుంటుంటే వారు డబ్బు పోగు చేసుకోడానికి ఆశ్రమాలు కడుతున్నారని విమర్శ చేసాము. ఆ పాపం చేత ఆకాశగమన శక్తి కోల్పోయి భూమి మీద పడ్డాము. చేసిన తప్పుకు ఎంతో పశ్చాత్తాపం చెంది శ్రీ మహావిష్ణువు ను ప్రార్థించగా, విష్ణువు ఒక బ్రాహ్మణ వేషంలో మా దగ్గరికి వచ్చి బుధాష్టమి వ్రత విధానం చెప్పి భక్తితో ఆచరించి అన్నదానం చేసి, బ్రాహ్మణునికి దక్షిణ ఇమ్మని చెప్పాడు.  మేము మా గురించి ఈ విషయాలు చెప్పినట్లు ఎవరికీ చెప్పరాదు. అలా చెబితే మీ తండ్రి నరకానికి వెడతాడని దేవతలు పలుకగా, అప్పుడు కౌశికుడు బుధాష్టమీ వ్రతము చేసి భోజనము చేసెను. దారిలో వనరక్షకుని వద్దకు వెళ్ళి తన ఎద్దును తీసికొని విజయతో ఇంటికి వెళ్ళెను. ధీరుడు ఇంత ఆలస్యం ఎందుకు అయ్యింది, ఎక్కడికి వెళ్ళారని అడుగగా దేవతలకిచ్చిన మాట మర్చిపోయి జరిగిన కథ అంతా యథాతథంగా కౌశికుడు చెప్పాడు. కొద్ది కాలము తరువాత ధీరుడు యుక్త వయసులో విజయకు వివాహము చేసెను. కొద్ది కాలం తరువాత తండ్రి  మరణించి యమలోకమునకు పోయెను. బుధాష్టమీ వ్రతము చేసిన వారికి రాజయోగం పడుతుంది.  అయోధ్యా నగర రాజుకు సంతానం లేకపోవడంతో, ఒక ఏనుగుకు పూల దండ ఇచ్చి ఎవరి మెడలో ఈ దండ ఏనుగు వేస్తుందో వారు ఈ  అయోధ్యా మహారాజు అని ప్రకటిస్తాడు.   కౌశికుని మెడలో ఆ ఏనుగు దండ వేసెను. అతడు అయోధ్యకు రాజు అయ్యెను. తన తల్లిదండ్రులు నరకయాతన అనుభవించుట చూచి, విజయ యముని శరణుజొచ్చెను. కౌశికుడు వేటకొఱకై వనమునకు వెళ్ళినపుడు"నా తల్లిదండ్రులు నరకము నుంచి విముక్తులెట్లగుదురు", అని ప్రశ్నించెను. అప్పుడు యముడు ప్రత్యక్షమై "రెండు బుధాష్టమీ వ్రతముల ఫలముచే విముక్తులగుదురు" అని చెప్పగా రెండు బుధాష్టమీ వ్రతముల ఫలమును ధార పోసెను. వారి తండ్రి స్వర్గమునకు వెళ్ళిరి. విజయ కూడ సంతసించి భోగ మోక్షాది సిద్ధికై ఈ వ్రతము ఆచరించెను.

బుధగ్రహ ధ్యానశ్లోకం: ప్రియంగు కలికాశ్యామం రూపేణా ప్రతిమం బుధం ।

సౌమ్యం సౌమ్య గుణోపేతం తం బుధం ప్రణమామ్యహం ॥

సర్వం శ్రీ గురుచరణారవిందార్పణమస్తు    బలం గురోః ప్రవర్ధతాం    సమస్త లోకాః సుఖినో భవంతు